నేడు కరెంటు ఉండని ప్రాంతాలు..

సనత్‌నగర్: సంజీవయ్య పార్కు, ఆల్విన్, ఎయిర్‌పోర్ట్, ప్రకాష్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు పాటిగడ్డ క్వార్టర్స్, నూర్‌బాగ్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రేమ్‌నగర్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, జెక్‌కాలనీ స్ట్రీట్ నెంబర్-1 ఇంద్రప్రస్థా బిల్డింగ్, హుడా లేన్, చిరాన్‌పోర్ట్ క్లబ్, పాస్‌పోర్ట్ ఆఫీసు, పాటిగడ్డ రోడ్డు, నవాబ్ గల్లీ, పైగా ప్యాలెస్, రసూల్‌పురా సర్కిల్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

ప్యారడైజ్ డివిజన్ పరిధిలో..

వసంతపురి సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ ఆదినారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు ఇందిరానగర్, లాలాపేట్ కమాన్, గణేష్ టెంపల్, ఇసుకబాయి, లక్ష్మీనగర్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ రోడ్డు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శోభ కుమర అపార్ట్‌మెంట్ ఏరియా, ఆర్యన్‌నగర్, శాంతినగర్ బస్టాప్ ఏరియా, వాటర్‌ట్యాంక్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ కోత అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

సికింద్రాబాద్ సర్కిల్ ఇన్‌చార్జి డీసీగా రాజు



సికింద్రాబాద్: జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఇంచార్జి డిప్యూటీ కమిషనర్‌గా గోధుమల రాజు సోమవారం నియమితులయ్యారు. ఇక్కడ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన డి.సుభాష్‌రావు కొద్ది రోజుల క్రితం బదిలీపై జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా వెళ్లారు. ఆయన స్థానంలో మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా కొనసాగుతున్న గోధుమల రాజును ఇన్‌చార్జిగా నియమిస్తూ సజోనల్ కమిషనర్ న్.రవికిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు.

బీజేపీ సనత్‌నగర్ ఉపాధ్యక్షుడిగా వంశీకృష్ణ

సనత్‌నగర్: బీజేపీ సనత్‌నగర్ డివిజన్ పాధ్యక్షుడిగా వంశీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి అందజేశారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు ఉంటుందని ఆయన తెలిపారు.


అమ్మవారికి కల్యాణం పట్టుచీర సమర్పించిన మాజీ కార్పొరేటర్



పట్టుచీరను అర్చకులకు అందజేస్తున్న మాజీ కార్పొరేటర్

అమీర్‌పేట: ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి అమ్మవారి కళ్యాణానికి పట్టుచీర,ఒడి బియ్యం, పసుపు, కుంకుమ బహుకరించారు. సోమవారం ఉదయం అమ్మవారి గర్భగుడిలో అమ్మవారి వస్త్రాలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులకు వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కూతురు నర్సింహ, కట్ట బలరాం,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంగా ప్రతాపరెడ్డి చేసిన సేవలు అభినందనీయం



హెచ్ఎం ప్రతాపరెడ్డి దంపతుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న డీఈఓ రోహిణి

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగు ప్రతాపరెడ్డి పదవీ విరమణ కార్యక్రమం సోమవారం గడి స్కూల్లో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా విద్యాధికారాణి రోహిణి ముఖ్యఅతిధులుగా హాజరై ప్రతాపరెడ్డి దంపతులను సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. గడి స్కూల్ అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి ప్రతాపరెడ్డి నిరంతరం పాటుపడ్డారని కొనియాడారు.

'గాంధీ'లో వేతన బకాయిలు చెల్లింపునకు

లైన్‌క్లియర్



గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించేందుకు లైన్‌క్లియర్ అయింది. ఆయా కాంట్రాక్టు సంస్థలకు మరో ఏడాది పొడిస్తున్న ప్రభుత్వం ఫర్‌దర్ కంటిన్యూ ఆర్డర్స్‌ను జారీ చేసింది. గాంధీఆస్పత్రిలో 12 కాంట్రాక్టు సంస్థల ఆధ్వర్యంలో 207 మంది క్లాస్‌ఫోర్, 154 మంది స్టాఫ్‌నర్సులు అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయా కాంట్రాక్టు సంస్థల కాలపరిమితి ఈ ఏడాది మార్చి 31వ తేదితో ముగిసింది. ఆయా సంస్థలనే కొనసాగిస్తారా, లేక నూతన సంస్థలకు అవకాశం కల్పిస్తారా అనే అంశం కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది యథావిధిగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఆయా కాంట్రాక్టు సంస్థలు గత మూడు నెలల వేతనాలు చెల్లించలేదు. వేతనాలు చెల్లించిన తర్వాత తమ కాంట్రాక్టును రద్దు చేస్తే ఆర్థికంగా నష్టపోతామని చెబుతు ఏప్రిల్ నెల నుంచి వేతనాలు చెల్లించేందుకు ఆయా కాంట్రాక్టు యాజమాన్యాలు ముందుకురాలేదు. ఈ క్రమంలో గతంలో ఉన్న 8 సంస్థలతో పాటు నూతనంగా మరో 4 సంస్థలకు అవకాశం కల్పించి, ఆయా సంస్థల కాలపరిమితి మరో ఏడాది 2026 మార్చి 31వ తేది వరకు పొడిగిస్తు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో వేతన బకాయిలు చెల్లించేందుకు మార్గం సుగమమైంది.

పెన్షన్‌లైన్‌లో ఉచిత వైద్య శిబిరం ప్రారంభం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో సామాజిక సేవాకార్యక్రమాల ఏర్పాటు కోసం తాను ప్రారంభించిన శ్రీగణేశ్ ఫౌండేషన్ (ఎస్‌జీఎఫ్) సేవలు నిరంతరాయంగా కొనసాగుతాయని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఎమ్మెల్యే తనయుడు ముకుల్ జన్మదినాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్, మెడికవర్ ఆసుపత్రి, ఎస్‌జీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్ ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేశ్ మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో గత పదేళ్లుగా నియోజకవర్గ వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇటీవల తాను ఎమ్మెల్యేగా గెలిచాక, ఎస్‌జీఎఫ్‌కు తగిన సమయం కేటాయించలేకపోతున్నానని అన్నారు. ఇకపై తన కుమారుడు ముకుల్ ఆధ్వర్యంలో గతంలో మాదిరిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న వారందరికీ అవసరమైన మందులు, కళ్లద్దాలతో పాటు శస్త్రచికిత్సలు కూడా చేయిస్తున్నామన్నారు. ఈ మేరకు ప్రాథమిక ఖర్చుల నిమిత్తం లయన్స్ క్లబ్ వారికి రూ.2 లక్షల విరాళం అందజేసినట్లు తెలిపారు.

కల్యాణ ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అమీర్‌పేట: ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా ఎల్లమ్మ కల్యాణ జరిపించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం ఉదయం వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులతో కలిసి ఆలయ పరిసరాల్లో పర్యటించి కల్యాణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి కల్యాణం చూసేందుకు అనేక ప్రాంతాల నుండి భక్తులు వస్తారని, అందుకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎన్.శేషకుమారి, ఈఓ మహేందర్‌గౌడ్,అన్నపూర్ణ, హైమావతి ,చైర్మన్ సాయిబాబాగౌడ్,బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు అండగా ఉంటా



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలిసిన రాజీవ్ రహదారి విస్తరణ బాధితులు

కంటోన్మెంట్: ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా ఆస్తులు కోల్పోతున్న బాధితులకు తగిన పరిహారం దక్కేలా చూస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్ హామీ ఇచ్చారు. రాజీవ్ రహదారి మార్గంలో ఆస్తులను కోల్పోనున్న బాధితులు జేఏసీ చైర్మన్ సతీష్ గుప్తా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలిసి తమ గోడు వినిపించారు. కొందరు పూర్తిగా నివాసాలను కోల్పోయి రోడ్డున పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు తక్షణ సాయం అందేలా చూసే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే అన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం విశాల దృక్పథంతో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తోందన్నారు. పరిహారం విషయంలో తగిన న్యాయం దక్కేలా చూస్తానన్నారు. వారం రోజుల్లో నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎం. శ్రీనివాస్, సూర్యప్రకాశ్ రెడ్డి, లింగేశ్, జే. శ్రీనివాస్, ప్రవీణ్, విద్యాసాగర్, మల్లేశ్ గౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ పదవీ విరమణ



పీసీఈ బ్రహ్మానందయ్యను సత్కరిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించి సోమవారం పదవీ విరమణ చేసిన పీసీఈ బ్రహ్మానందయ్యను మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ శంకర్ రావు ఘనంగా సత్కరించారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు రైల్ నిలయంలో పీసీఈ బ్రహ్మానందయ్యను కలిసి పుష్పగుచ్చం అందజేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శంకర్ రావు మాట్లాడుతూ బ్రహ్మానందయ్య ఇంజినీరింగ్ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేశారాని, త్వరిగతిన ప్రమోషన్లు అందించారాని, పెండింగ్ లో ఉన్న అనేక సమస్యలు ఆయన పరిష్కరించాలని వెల్లడించారు. కార్యక్రమంలో జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీధర్, కోశాధికారి సరోజినీ రెడ్డి, అడిషనల్ జనరల్ సెక్రెటరీ ఉదయ భాస్కర్, శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, సంజీవయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నూతన అధ్యక్షుడిని కలిసిన అడ్డగుట్ట నేతలు



అడ్డగుట్ట: భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావును అడ్డగుట్టకు చెందిన బీజేపీ నేతలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావును శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. నాయకులు సీహెచ్. వేణుగోపాల్, జీ. నరేందర్‌లు ఉన్నారు.

తుకారాంగేట్ ఎస్ఐ పదవీ విరమణ



ఎస్ఐ వెంకటేశ్వర్లు

అడ్డగుట్ట: తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు సోమవారం పదవీ విరమణ చేశారు. రెండేళ్ల క్రితం ఏఎస్ఐగా తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చి ఇటీవల ఎస్ఐగా ప్రమోషన్ పొందారు. పదవీ విమరణను పురస్కరించుకొని ఈ మేరకు తుకారాంగేట్ పోలీసులు ఎస్ఐ వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

రైల్వేలో 163 మంది పదవీ విరమణ



అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌లో సోమవారం 163 మంది అధికారులు, ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా రిటైర్ అయిన వారిని ఆయా విభాగాల సిబ్బంది వారి వారి కార్యాలయాల్లో ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. హెడ్ క్వార్టర్స్, సికింద్రాబాద్, హైద్రాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్‌షాప్‌లలో వీరు విధులు నిర్వహించారు. అకౌంట్స్ విభాగంలో పదవీ విరమణ చేసిన జే.వి.యల్. ప్రసాద్, తుహీనా, క్రిస్టోఫర్, పూర్ణచందర్ రావులను మజ్దూర్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి చింతకుంట రామకృష్ణ శాలువాలతో ఘనంగా సత్కరించారు.

అమ్మవారిని దర్శించుకున్న వయోవృద్ధులు, దివ్యాంగులు

అమీర్‌పేట: ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవము సందర్భంగా ఆలయ అధికారులు వయోవృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. కళ్యాణం రోజున విపరీతమైన రద్దీ ఉంటున్న నేపథ్యంలో వేడుకల ప్రారంభం రోజే అమ్మవారిని దర్శించుకునేందుకు వీలు కల్పించాలని రాయల సేవాసమితి ప్రతినిధులు అధికారులను కోరారు. సానుకూలంగా స్పందించిన ఈఓ మహేందర్‌గౌడ్ సోమవారం 10 గంటల నుండి 11 గంటల సమయంలో ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనాలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.దీంతో వయోవృద్ధులు,దివ్యాంగులు ఎల్లమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించినట్లు రాయల సేవా సమితి వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ తెలిపారు.

మొబైల్ ఫోన్ దొంగల అరెస్టు

కంటోన్మెంట్: ప్రయాణికుల దృష్టి మరల్చి మొబైల్ ఫోన్‌ల చోరీకి పాల్పడుతున్న ముగ్గురిని గోపాలపురం పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. గోపాలపురం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ సుబ్బయ్య కేసు వివరాలు వెల్లడించారు. డేరంగుల దుర్గారావు అనే క్యాబ్ డ్రైవర్, గత శనివారం రాత్రివేళలో చిలకలగూడ ఎక్స్‌రోడ్‌లో నిల్చుని ఉండగా, ముగ్గురు ఆగంతకులు అతని ఒప్పో ఎఫ్ 27ను ఫోన్ లాక్కొని వెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, సుమారు 50 సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి దొంగలను గుర్తించారు. ముగ్గురు నిందితుల్లో ఇద్దరు మదన రవి తేజ (21), బల్ల నాగ చెన్నకేశ (21)లు చిలకలగూడ పీఎస్ పరిధిలోని రౌడీషీటర్లు కాగా, మరో వ్యక్తి జువైనల్‌గా గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని రెండు మొబైల్ ఫోన్‌లు, టూవీలర్‌లను స్వాధీనం చేసుకున్నారు.

నేటి నుంచి 52 రోజుల పాటు ఎన్ఎస్‌పీసీ

సనత్‌నగర్: నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ కాంపిటీషన్ (ఎన్ఎస్‌పీసీ)-2025 పోస్టర్‌ను సోమవారం హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారిణి ఆర్.రోహిణి ఆవిష్కరించారు. జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేంద్రరావు, డీఈఓ ఆఫీస సూపరింటెండెంట్ రాజేందర్, ప్రియదర్శిని ఎన్జీఓ సుబ్బలక్ష్మీ, సన్నిహిత ఎన్జీఓ ఉషారాణిలతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావాల నుంచి రక్షణ కోసం విద్యార్థుల్లో పర్యావరణ నైపుణ్యాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవడం అత్యంత అవసరమన్నారు.

పోస్టల్ డెలివరీ అవసరాలను తీర్చేలా డీపీఎస్

సనత్‌నగర్: పెరుగుతున్న పోస్టల్ డెలివరీ అవసరాలను తీర్చడానికి ప్రత్యేకంగా డెలివరీ సెంటర్ (డీపీఎస్)ను ఏర్పాటు చేసినట్లు పోస్టుమాస్టర్ జనరల్ ఎస్ఆర్ విసాలాట్చి తెలిపారు. సనత్‌నగర్‌లోని తపాలా కార్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన డెలివరీ సెంటర్‌ను సోమవారం డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ రిప్పన్ డల్లెట్‌తో కలిసి విసాలాట్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తపాలా కార్యకలాపాలను మెయిల్ సేవలను కేంద్రీకరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలన అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. పోస్టాఫీసు సీనియర్ సూపరింటెండెంట్ సీహెచ్.రామకృష్ణ, సహాయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

కరెంట్ తీగలపై పడిన చెట్టుకొమ్మ.. నేలకొరిగిన విద్యుత్ స్తంభం

అడ్డగుట్ట: భారీ గాలుల కారణంగా సోమవారం ఉదయం తుకారాంగేట్ సాయినగర్‌లో చెట్టుకొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడింది. ఆ బరువుకు ఒక్కసారిగా విద్యుత్ వైర్లకు సంబంధించిన స్తంభం కూడా నేలకొరిగింది. దీంతో కరెంట్ తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభం విరిగిపడడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

రోస్టర్ పాయింట్‌ను సవరించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణలో రోస్టర్ పాయింట్‌ను సవరించాలని మాల స్టూడెంట్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాల నేతలు మాందాల భాస్కర్, మాదాసు రాహుల్ మాట్లాడారు. రోస్టర్ పాయింట్ లోపభూయిష్టంగా ఉందని గతంలో ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన రోస్టర్ పాయింట్ 7 ఉంటే ఇప్పుడు 22వ రోస్టర్ పాయింట్‌కు మారిందన్నారు. దీని వలన మాల, మాల ఉపకులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు.

కంటోన్మెంట్‌లో ఐదుగురు పదవీ విరమణ

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో సోమవారం ఐదుగురు ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. స్టోర్ కీపర్ రాజ్‌కుమార్‌తో పాటు, నలుగురు సఫాయీ వాలాలు ఏ. యాదగిరి, లక్ష్మణ్, జగన్, శేఖర్ దుర్గయ్యలు పదవీ విరమణ పొందారు. దీంతో కంటోన్మెంట్ బోర్డు పర్మినెంట్ ఉద్యోగులు సంఖ్య 370కి పడిపోయింది. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు జాయింట్ సీఈఓ పల్లవి విజయ్ వర్షి, సానిటరీ సూపరింటెండెంట్, ఆఫీస్ సూపరింటెండెంట్ ఇతర ఉన్నతాధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బీజేఆర్ బస్తీ కమిటీ ప్రతినిధి బృందం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ బీజేఆర్ నగర్ బస్తీలో అనేక సమస్యలను పరిష్కరించినట్లు గుర్తు చేశారు.

టీజీపీసీబీ జేసీఈఈ హనుమంతరెడ్డి పదవీ విరమణ

సనత్‌నగర్: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి హైదరాబాద్ జోనల్ కార్యాలయ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ జి.హనుమంతరెడ్డి సోమవారం పదవీ విరమణ చేశారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో టీజీపీసీబీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించారు.

సీడీఈడబ్ల్యూ సేవలపై అవగాహన

సనత్‌నగర్: సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ (సీడీఈడబ్ల్యూ) బేగంపేట అందించే సేవలపై స్వయం సహాయక బృంద మహిళలతో కలిసి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సెలింగ్ విధానాన్ని వివరించారు. సహాయం కోసం ఏ సమయంలోనైనా సీడీఈడబ్ల్యూను సంప్రదించాలని సూచించారు. బేగంపేట ఉమెన్స్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ ఉమామహేశ్వరి హాజరయ్యారు.

శ్మశానవాటిక ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లోని కురుమ కమ్యూనిటీకి సంబంధించిన శ్మశానవాటిక ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని హైద్రాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందనను కోరారు. సోమవారం కురుమ సంఘం నాయకులు చీర శ్రీకాంత్, శివప్రసాద్ తదితరులు కలిసి హైద్రాబాద్ కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చాచానెహ్రూనగర్‌లోని కురుమ కమ్యూనిటీకి సంబంధించిన శ్మశానవాటిక అక్రమణకు గురై భవన నిర్మాణాలు జరుగుతున్నాయని వెంటనే దీన్ని పరిరక్షించాలని కోరారు. తమ కమ్యూనిటీ శ్మశానవాటిక కబ్జాకు గురైయిందని పేర్కొంటూ పలు ఆధారాలతో సంఘం నాయకులు కలెక్టర్‌కు సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీ కొన్న ఆర్టీసీ బస్సు



లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట ప్రధాన రహదారిలో దోభీఘాట్ వద్ద సోమవారం రాత్రి ఆర్టీసీ బస్సు డివైడర్‌ను ఢీకొట్టింది. కాచిగూడ డిపోకు చెందిన 3 నెంబర్ ఆర్టీసి బస్సు ఈసిఐఎల్ నుంచి లాలాపేట మీదుగా తార్నాక వైపు వెళుతుంది. వర్షంలో వేగంగా వెళుతున్న ఆర్టీసి బస్సు డ్రైవర్‌కు డివైడర్ కనిపించకపోవడంతో బలంగా ఢీ కొట్టాడు. దీంతో బస్సులోని ప్రయాణికులు గాయపడ్డారు. 108 అంబులెన్స్ అక్కడికి చేరుకుని గాయపడ్డ పలువురి ప్రయాణీకులను చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.